ఆంధ్రజ్యోతి-ఏబీఎన్

ముత్యాల ముగ్గుల పోటీలు 7న



కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గులు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్ట్‌నర్ స్వర్ణసీమ సుకేతన' ఆధ్వర్యంలో ఈనెల 7న కేపీహెచ్‌బీ మూడోఫేజ్ రమ్యగ్రౌండ్‌లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసక్తిగల మహిళలు పాల్గొనవచ్చు. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి, ఎవరి రంగులు వారే తెచ్చుకోవాలి. ముగ్గుల్లో గొబ్బెమ్మలు, బతుకమ్మలను పేర్చుతూ పువ్వులు, రంగులతో అందంగా అలంకరించుకోవచ్చు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 6 వేలు, ద్వితీయ బహుమతి రూ. 4 వేలు, తృతీయ బహుమతి 3 వేలు అందజేస్తారు. ముగ్గులు వేసిన ప్రతిఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. వివరాలకు 9985411022, 9700637537 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.



పోస్టాఫీసు రోడ్డులో పారుతున్న మురుగునీరు



టర్న్ బిల్డింగ్ ఎదురుగా.

రోడ్లపై మురుగు పరుగు

- కో-ఆపరేటివ్ ఇండస్ట్రీస్ ఎస్టేట్‌లో కొన్ని నెలల నుంచి..
- దుర్వాసనతో స్థానికులు నడవలేని పరిస్థితి

బాలానగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కో-ఆపరేటివ్ ఇండస్ట్రీస్ ఎస్టేట్‌లో రోడ్లపై మురుగు నీరు పరుగుతీస్తోంది. నిత్యం రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో కార్మికులు నడవలేని పరిస్థితి నెలకొంది. దుర్వాసన వస్తుండడంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. పోస్టాఫీసు, టర్న్ బిల్డింగ్ రోడ్లలో కొన్ని నెలల నుంచి మురుగునీరు పారుతోంది. వాహనదారులు కిందపడి గాయపడిన సంఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. పరిశ్రమల నిర్వాహకులు మురుగునీటిని రోడ్లపైకి విడుదల చేస్తున్నారని అంటున్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ ఏఈ అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

జీడిమెట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట విద్యుత్ సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు వివిధ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. సబ్‌స్టేషన్‌లో విలువైన ప్రభుత్వ ఆస్తులను ఏఈ అమ్ముకున్నారని ఆరోపించారు. మహిళా కార్మికులతో అసభ్యకరంగా మాట్లాడుతూ, దూషిస్తున్నారని, విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాకు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి జి. ఐలయ్య సంఘీభావం తెలిపారు. ఎండీ షౌకత్‌పాషా, రాజ్‌కుమార్, జగన్, అనిల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలం కాపాడాలంటూ ఆందోళన

పేట్‌బషీరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడలో పార్కు స్థలాన్ని కాపాడాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఐలా కార్యాలయ సమీపంలో పార్కు స్థలం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్, మాజీ కౌన్సిలర్ నర్సయ్య మాట్లాడుతూ.. గాంధీనగర్ పారిశ్రామికవాడ ఏర్పాటు చేసినప్పుడు పార్కు, వాటర్‌ట్యాంక్, పోస్టాఫీసు, బ్యాంక్‌ల కోసం స్థలాలు కేటాయించారు. అధికారులు ఆ స్థలాలను ఇతరులకు కేటాయించారని, వాటర్‌ట్యాంక్ స్థలాన్ని అయినా కాపాడి ప్రజలు, కార్మికుల సౌకర్యార్థం భవనం నిర్మించాలని కోరారు. ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సంతోష్, యాకుబ్, చందూ, ఇమామ్, బాల్‌రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో సందర్శకులు

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కొలన్ నారాయణరెడ్డి గార్డెన్స్‌లో కళా సిల్క్స్ ఆధ్వర్యంలో చేనేత హస్త కళా ప్రదర్శన ప్రారంభమైంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేత కారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రవేశం ఉచితం అని నిర్వాహకులు తెలిపారు.

శేరిలింగంపల్లిలో ఒకరికి కరోనా

గచ్చిబౌలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కరోనా కేసు నమోదైంది. కొండాపూర్‌లో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో 20 మందికి బుధవారం కొవిడ్ పరీక్షలు చేయగా ఒకరికి కొవిడ్ పాజిటివ్ వచ్చినట్లు సూపరింటెండెట్ రాగిణిరెడ్డి తెలిపారు.

కొంపల్లిలో సమస్యలు పరిష్కరించాలి

పేట్‌బషీరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కొంపల్లిలో మురుగునీరు, రహదారుల సమస్య పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలిసి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి దానకిషోర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ మునిసిపల్ అధ్యక్షుడు బి. ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

రంగారెడ్డినగర్ డివిజన్ మారుతీనగర్, విజయనగర్ కాలనీల్లో అయోధ్య రామయ్య అక్షింతలను భక్తులు ఎం. శ్రీనివాస్, గణేశ్, భాస్కర్‌రావు, మహిళలు బుధవారం పంపిణీ చేశారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

నిజాంపేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే ఆశయాలను ప్రతిఒక్కరూ పాటించాలని జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్‌ఎం చారి అన్నారు. ఆమె జయంతి సందర్భంగా ప్రగతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల విద్యకోసం సావిత్రిబాయి పూలే పోరాడారని, దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు ఆమె అని అన్నారు. విద్యార్థులకు ఆమె చేసిన త్యాగాలను వివరించారు. ప్రధానోపాధ్యాయులు చెన్నయ్య, ఉపాధ్యాయులు ప్రసన్న, భారతి, శ్యామల, దినకర్, జనవిజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.

చందానగర్: భారత తొలి మహిళా సంఘ సంస్కర్త, మహిళా ఉపాధ్యాయురాలు, మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన వారిలో సావిత్రిబాయి పూలే ఒకరని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ అన్నారు. బుధవారం న్యూ గుడ్‌షెపర్డ్ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, పెన్సిల్స్, పెన్నులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం మెర్సీ, అసోసియేషన్ సభ్యులు మల్లేశ్, నర్రాల మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న జనవిజ్ఞానవేదిక సభ్యులు, ఉపాధ్యాయులు

- హుడా కాలనీలో జనసేన పార్టీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మాధవరెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేటి యువత సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని అక్షరాస్యత పెంపునకు కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రసాయన వ్యర్థాల డంపింగ్

- మూతపడిన కోపల్లి ఫార్మా కంపెనీ ఆవరణలో..
- యాజమాన్యానికి నోటీసులు జారీ చేస్తాం : పీసీబీ

జీడిమెట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామిక వాడలో బుధవారం భారీ కెమికల్ డంపింగ్ బయటపడింది. ప్రమాదకరమైన రసాయన వ్యర్థాలు, కెమికల్ పౌడర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు మూతపడిన ఓ పరిశ్రమ ఆవరణలో డంప్ చేశారు. దీంతో పక్కనే ఉంటున్న ఎస్‌ఆర్‌నాయక్‌నగర్ మోడీబిల్డర్స్ ప్రజలు ఘాటైన వాసనతో ఇబ్బంది పడుతున్నారు. కోపల్లి ఫార్మా యాజమాన్యం ప్లాట్‌లు చేసి విక్రయించింది. కంపెనీలో నాలా పక్కన ఉన్న స్థలంలో బుధవారం కెమికల్ వ్యర్థాల డంప్ బయటపడింది. దీనిపై పీసీబీ ఈఈ రాజేందర్‌ను వివరణ కోరగా.. రసాయన వ్యర్థాల డంపింగ్ విషయమై కంపెనీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.



డంపింగ్ చేసిన రసాయన వ్యర్థాలు

దిల్‌కుష్‌నగర్‌లో ప్రజాపాలన కేంద్రం ప్రారంభం

బాలానగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దిల్‌కుష్‌నగర్ కమ్యూనిటీ హాలులో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఏఈ రషీద్ పర్యవేక్షణలో న్యాక్ సిబ్బంది కవిత, ఇద్దరు ఆశా వర్కర్లు దరఖాస్తులు స్వీకరించారు. బుధవారం సుమారు 500 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ప్రజాపాలన కేంద్రాల పరిశీలన

ఫతేనగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్, బాలానగర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలను కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండిరమేష్ బుధవారం సందర్శించారు. ఏఈ పవన్ తీరు ఇబ్బందిగా ఉందని స్థానికులు కొందరు ఆయనకు ఫిర్యాదు చేశారు. మహిళా కాంగ్రెస్ కార్యదర్శి పుష్పారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కె. రమేష్, నాయకులు సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గూడెపు నాగరాజు, అబ్దుల్ బాకీ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం: నల్లగండ్లలోని మహిళా భవన్‌లో ప్రజాపాలన కేంద్రాన్ని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. కేంద్రానికి వచ్చే ప్రజలకు దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు.

తల్లీపిల్లల అదృశ్యం



అదృశ్యమైన తల్లీపిల్లలు

దుండిగల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తల్లి, ముగ్గురు పిల్లలు అదృశ్యమయ్యారు. మల్లంపేట ఇందిరమ్మ కాలనీ, బ్లాక్ నెంబర్ 1/20లో ఉంటున్న ఇంతియాజ్ అహ్మద్, భార్య రుబీనా బానో, ముగ్గురు పిల్లలతో కలిసి నివసిస్తూ టైలరింగ్ పనిచేస్తున్నాడు. ఈనెల 2న మియాపూర్‌లో టైలరింగ్ షాపుకు వెళ్లాడు. భార్యకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అతడు ఇంటికి రాగా భార్య, కుమార్తె అల్షితా(10), కుమారులు షఫియాన్(8), అనాష్(2) కనిపించలేదు. వారి ఆచూకీ లభించకపోవడంతో దుండిగల్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నాడు.





తహసీల్దార్ పోస్టు ఖాళీ

- ధ్రువపత్రాల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు

మియాపూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దాదాపు మూడు వారాలుగా శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ లేకపోవడంతో వివిధ అవసరాలు, సర్టిఫికెట్ల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్డీఓ మల్లయ్య ఇన్‌చార్జిగా ఉన్నప్పటికీ ఆయన తరచూ కార్యాలయానికి రాకపోవడంతో అనేక ఫైల్స్ మూలనపడ్డాయి. గోపన్‌పల్లిలో భూముల క్రమబద్ధీకరణలో అవకతవకలు జరగడంతో తహసీల్దార్‌ను కలెక్టరేట్‌కు అటాచ్ చేశారు. తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య శిబిరం, అన్నదానం

మియాపూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామదూత ట్రస్టు జేపీఎన్‌నగర్ విశ్వనాథ గార్డెన్‌లో ఉచిత వైద్యశిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించింది. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్టు వలంటీర్లు పాల్గొన్నారు.

డైమండ్స్ కాలనీ సమస్యలు సీఎం దృష్టికి..

రాయదుర్గం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డైమండ్‌హిల్స్‌కాలనీలో సమస్యలు పరిష్కరించాలని అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. సీఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇంటి నిర్మాణ అనుమతులు, డ్రైనేజీ, రోడ్ల నిర్మాణం సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



చంద్రబాబును కలిసిన కొల్లూరి దంపతులు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడును కేపీహెచ్‌బీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కొల్లూరి శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కేటీఆర్‌తో ఎమ్మెల్యే సమావేశం

కూకట్‌పల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమావేశమయ్యారు. కేటీఆర్ మాట్లాడుతూ.. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు భారీ మెజారిటీ వచ్చేందుకు కృషి చేయాలన్నారు. కేటీఆర్‌ను ఎమ్మెల్యే, కార్పొరేటర్లు సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.









